స్వాముల సేవలో తరిస్తూ..!


దుర్గిలోని అయ్యప్ప స్వామి ఆలయ ముఖద్వారం


స్వాములకు అన్నదానం చేస్తున్న సేవాసమితి సభ్యులు

- కార్తిక మాసంలో స్వాములకు అన్నదానం చేస్తున్న అయ్యప్ప సేవాసమితి, దుర్గి వాసులు
- ఐదేళ్లుగా ప్రతి ఏటా సేవా కార్యక్రమాలు
- ప్రతిరోజూ గ్రామంలో నగర సంకీర్తన

దుర్గి: అన్ని దానాలలోకెల్లా అన్నదానం ఎంతో గొప్పదని పెద్దలు చెప్పిన విధంగా దుర్గిలోని అయ్యప్ప స్వామి దేవాలయంలో అయ్యప్ప స్వామి సేవా సమితి, దుర్గి వాసుల ఆధ్వర్యంలో కార్తికమాసంలో ప్రతీ ఏటా వేలాది మంది అయ్యప్ప స్వామి మాలధారులకు, భక్తులకు, ఇతర మాలాధారులకు మండలం రోజులు ప్రతి రోజూ అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ అన్నదాన కార్యక్రమంలో దుర్గి గ్రామంలోని అయ్యప్ప స్వామి మాలాధారులే కాకుండా చుట్టు పక్కల ప్రాంతాలకు చెందిన భక్తులు కూడా పాల్గొంటారు.

30 ఏళ్ల క్రితం ఆలయం నిర్మాణం..

30సంవత్సరాల క్రితం అయ్యప్ప స్వామి సేవా సమితికి చెందిన భక్తులు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ వెలిదండి గోపాల్, యకటీల చిన్నబ్బాయ్, కటకం యలమంద, గూడా కోటేశ్వరరావు పలువురు భక్తుల ఆధ్వర్యంలో శ్రీ హరిహరపుత్ర అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణం చేశారు. ప్రతి ఏటా అయ్యప్ప స్వామి జన్మదినం సందర్భంగా పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహిస్తూ తమ భక్తిని చాటుకుంటున్నారు. 2019 నుంచి గత ఐదేళ్లుగా ప్రతి కార్తిక మాసంలో అయ్యప్పలకు, ఇతర మాలధారులకు సద్ది వితరణ చేస్తూ స్వాముల సేవలో తరిస్తున్నారు. గత నెల 16వ తారీఖు నుంచి ప్రారంభమైన అన్నదాన కార్యక్రమం మకర సంక్రాంతి జ్యోతి సందర్శన వరకు నిర్విరామంగా కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు.

ప్రతిరోజూ 300 – 400 మందికి అన్నదానం

ప్రతి రోజూ కార్తికమాసంలో 300నుంచి 400 మంది భక్తులు అన్నదాన కార్యక్రమానికి హాజరవుతున్నారు. గ్రామస్తులు, దాతలు సహకారంతో విరాళాలు సేకరించి నిధిగా ఏర్పాటు చేసి ప్రతి సంవత్సరం రూ.10లక్షల నుంచి రూ.12లక్షల వరకు కేవలం అన్నదానానికి కేటాస్తున్నారు. ఈ అన్నదాన కార్యక్రమాన్ని నిర్విరామంగా కొనసాగించటంపై ఇతర గ్రామస్తులు సైతం దుర్గి గ్రామస్తులను అభినందిస్తున్నారు. కార్తికమాసంలో అయ్యప్ప స్వాముల సందడితో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. నియమనిష్టలతో 48 రోజుల పాటు స్వాములు తమ ఇళ్లలోనూ ఆధ్యాత్మిక కార్యక్రమాలను కొనసాగిస్తూ తమ భక్తిని చాటుకుంటున్నారు. ఈ దీక్షతో చాలా మంది భక్తులలో మంచి అలవాటుతో పాటు, ఆరోగ్యం కూడా సమకూరుతుందని గురుస్వాములు తెలియజేశారు.

గ్రామస్తుల సహకారం మరువలేనిది



అయ్యప్ప భక్తులకు అన్నదానం ఏర్పాటు చేయటం చాలా మంచి కార్యక్రమం. మా ఇంటి వద్ద కేవలం నా కోసం చద్ది ఏర్పాటు చేయటం చాలా కష్టం. అటువంటి ఇబ్బందులు లేకుండా భక్తులందరితో కలిసి అన్నదాన కార్యక్రమంలో పాల్గొనటం చాలా సంతోషంగా ఉంది.

– గొరిగె చౌదయ్య, అయ్యప్ప స్వామి మాలధారుడు

మాలధారులకు ఎంతో సౌకర్యం



అయ్యప్ప మాలతో పాటు, ఆంజనేయ, శివ మాలధారులకు కూడా ఈ అన్నదాన కార్యక్రమం ఎంతో ఉపయోగంగా ఉంటుంది. కులాలకు అతీతంగా అందరం స్వామి వారిని పూజించుకోవటంతో పాటు నగర సంకీర్తనలో పాల్గొంటున్నాం. మాల వేసుకున్న మాకు ఎంతో ప్రశాంతంగా స్వామి వారిని పూజించుకోవడమే కాకుండా మా రోజు వారీ కార్యక్రమాలు సక్రమంగా చేసుకునేందుకు కూడా ఈ అన్నదాన కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుంది.

– కటకం భిక్షమయ్య, అయ్యప్ప స్వామి మాలధారుడు

ఎస్పీ ఆకస్మిక తనిఖీ

గురజాల రూరల్: గురజాల సబ్ డివిజన్ కార్యాలయాన్ని పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు బుధవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని వివిధ పోలీస్ స్టేషన్‌లకు సంబధించి రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణ తనిఖీల్లో భాగంగా కార్యాలయానికి వచ్చామన్నారు. నూతన హైవే రహదారిపై ప్రమాదాలు జరగకుండా పోలీస్ అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. ప్రమాద నివారణ బోర్డులను త్వరలో ఏర్పాటుచేస్తామన్నారు. డీఎస్పీ బి.జగదీష్, సీఐ భాస్కర్ రావు, ఎస్ఐలు ఉన్నారు.

కర్రలతో దాడి.. వ్యక్తికి గాయాలు

పిడుగురాళ్ల: కర్రలతో దాడిచేసిన సంఘటనలో వ్యక్తికి గాయాలైన ఘటన పిడుగురాళ్ల పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో జరిగింది. సంఘటనకు సంబంధించి పట్టణ ఎస్ఐ శివనాగరాజు తెలిపిన వివరాల మేరకు.. గత నెల 31వ తేదీన రమావత్తు ప్రవీణ్ నాయక్, రామాంజనేయ నాయక్‌లు గొడవ పడ్డారు. పెద్దల సమక్షంలో గొడవ సర్దుమణిగింది. ఈ క్రమంలో ప్రవీణ్‌నాయక్‌ను మాట్లాడాలని చెప్పి ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణానికి రామాంజనేయ నాయక్ పిలిచాడు. వచ్చిన వెంటనే వడితే సాంబశివనాయక్‌తో కలిసి కర్రలతో దాడి చేయటంతో తలకు గాయాలు అయ్యాయి. బాధితుడు గురజాల ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందాడు. అనంతరం పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

క్లుప్తంగా

మార్మోగిన శివ నామస్మరణ



రెంటచింతల: అతిపురాతన శైవక్షేత్రమైన గంగా భ్రమరాంబ సమేత మల్లిఖార్జున స్వామి దేవస్థానం బుధవారం పరమేశ్వరుని నామస్మరణతో మార్మోగింది. దేవస్థానం సమీపంలోని పవిత్ర కృష్ణానది ఒడ్డున వేకువజామునుంచే భక్తులు కార్తిక దీపాలు వెలిగించి పుణ్యస్నానాలు చేసి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థానంలో రెండు తెలుగు రాష్ట్రాలలోని అనేక ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. అర్చకుడు చిట్టేల శివ శర్మ ఆధ్వర్యంలో స్వామివార్లకు భక్తిశ్రద్ధలతో పూజలు, అభిషేకాలు నిర్వహించారు. బైరవునిపాడు సర్పంచ్ జింకల వెంకటేశ్వర్లు యాదవ్, నాగేంద్రమ్మ దంపతులు 1000 మంది భక్తులకు, వివిధ స్వామి మాలలు స్వీకరించిన మాలధారులకు అన్నదానం చేయగా ఎండోమెంట్ ఈఓ గాదె రామిరెడ్డి, కమిటీ సభ్యులు వారిని ఘనంగా సన్మానించారు.

డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగంగానే పవన్ పర్యటన

వైఎస్సార్ సీపీ నాయకుడు డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్

పిడుగురాళ్ల: డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగంగానే పల్నాడులో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పర్యటన జరిగిందని వైఎస్సార్ సీపీ నాయకుడు డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్ పేర్కొన్నారు. పట్టణంలోని తన కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండు రోజుల క్రింతం పిఠాపురంలో నియోజకవర్గంలో ఆడబిడ్డకు న్యాయం జరగడం లేదని హోం శాఖ ఏ చేస్తుందంటూ సంబంధిత శాఖ మంత్రి అనితపై చేసిన వ్యాఖ్యలు దుమారం లేపి కూటమి బలంపై ప్రజల్లో, ఇరు పార్టీల క్యాడర్‌లో తీవ్ర చర్చలు జరుగుతున్న నేపథ్యంలో వాటిని డైవర్ట్ చేయడం కోసమే పవన్ కల్యాణ్ హుటాహుటిన పల్నాడు పర్యటన చేశారని ఆయన విమర్శించారు. కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే పల్నాడులో పర్యటించారని ప్రజలందరికీ తెలుసన్నారు. ఇప్పటికైనా డైవర్షన్ పాలిటిక్స్ మానుకుంటే మంచిదని ఆయన తెలియజేశారు.

దళిత క్రైస్తవులను ఎస్సీ జాబితాలో చేర్చాలి



గురజాల: దళిత క్రైస్తవులను ఎస్సీ జాబితాలో చేర్చాలని మండల పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కొమ్ము నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక కింగ్‌డమ్ గాస్పల్ చర్చిలో బుధవారం దైవ సేవకుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పాస్టర్లు అందరూ ఐకమత్యంగా ముందుకు సాగాలన్నారు. అసోసియేషన్ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అనంతరం తహసీల్దార్ కె.నగేష్‌కు వినతిపత్రం అందించారు. హనోకు నాయక్, మధుబాబు, జయప్రకాశ్, జాకబ్, డేవిడ్, కోటిరెడ్డి, లాజరు, థామస్, మోషే, జాన్‌రాజ్, కళ్యాణ్, దైవ సేవకులు పాల్గొన్నారు.

ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



రెంటచింతల: రైతులకు ఎరువులు, పురుగు మందులను అధిక ధరలకు విక్రయించే దుకాణదారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షాపులలో ఉన్న ప్రతి సరుకుకు ఖచ్చితంగా సీపీలు కలిగి ఉండాలన్నారు. సీపీలు లేకుండా ఎరువులు, పురుగు మందులు రైతులకు అమ్మడం చట్టప్రకారం నేరమన్నారు. నిల్వలు, క్రయవిక్రయాల సమాచారం రికార్డులో నమోదు చేయాలని సూచించారు.

పట్టభద్రుల ఓటర్ల నమోదు గడువు పెంచాలి



రెంటచింతల: పట్టభద్రుల నియోజకవర్గాల్లో ఓటర్ల నమోదు ప్రక్రియ నిదానంగా కొనసాగుతున్న నేపథ్యంలో ఈ నెల 18 వరకు ఓటర్ల నమోదు గడువును పెంచాలని కన్నెగంటి హనుమంతు ఫౌండేషన్ అధ్యక్షుడు నారాయణ పురం శ్రీనివాసరావు కోరారు. బుధవారం రెంటచింతలలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టభద్రుల ఓటర్ల నమోదు కోసం కొందరు అధికారులు, బీఎల్‌ఓలు పది, ఇంటర్ సర్టిఫికెట్‌లు తప్పనిసరి అనడం వలన దరఖాస్తుకు ఓటర్లు వెనకడుగు వేస్తున్నట్లు తెలిపారు. గతంలో నిర్వహించిన పట్టభద్రుల ఎన్నికలలో రెండు, మూడు సార్లు ఓటు హక్కును వినియోగించుకున్న వారు కూడ మళ్లీ రిజిస్ట్రేషన్(దరఖాస్తు) చేసుకోవాల్సి రావడం వలన కొందరు ఈ ఎన్నికలకు దూరంగా ఉన్నట్లు తెలిపారు.

ఓటరు జాబితాలో అభ్యంతరాలు తెలపండి


రాజకీయ పార్టీల నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ బత్తుల వాణి

మాచర్ల రూరల్: నియోజక వర్గ ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు అనంతరం చేసే పబ్లికేషన్ పై రాజకీయ పార్టీల ప్రతినిధులు అభ్యంతరాలు, సూచనలు ఉంటే తెలియజేయాలని తహసీల్దార్ బత్తుల వాణి కోరారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఓటర్ల తుది జాబితా తయారు చేసేందుకు బీఎల్‌ఓలు ఇప్పటికే సర్వేను పూర్తి చేసి ఫైనల్ పబ్లికేషన్ చేసేందుకు పార్టీల ప్రతినిధుల అభిప్రాయాలను కోరుతున్నామన్నారు. కొత్త వారిని చేర్చేందుకు, చనిపోయి వారివి, వేరే ప్రాంతంలో నివాసముంటున్న వారిని జాబితాలో తొలగించేందుకు అభ్యంతరాలు తెలుసుకునేందుకు ఈ నెల 9,10, 23,24 తేదీలలో ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బీఎల్‌ఓల నేతృత్వంలో ఆయా కేంద్రాలలో జరిగే క్యాంపులలో ఏమైనా అభ్యంతరాలు, సలహాలు ఉంటే బీఎల్‌ఓలకు తెలియజేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎన్నికల డీటీలు షేక్ బాషా, గుంటి వెంకటరమణ, మున్సిపల్ కమిషనర్ ధూళిపాళ్ళ వేణుబాబు, వైఎస్సార్ సీపీ నియోజక వర్గ బూత్ కన్వీనర్ కుర్రా వెంకటేశ్వర్లు, బీజేపీ, టీడీపీ, బీఎస్పీల ప్రతినిధులు గుమ్మడి నాసరయ్య, సైదులు, జల్లెల్ల ఏడుకొండలు, ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ రామాంజనేయులు, రంగారావు పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో ‘పొలం పిలుస్తోంది’


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ లక్ష్మారెడ్డి, ఉద్యాన శాఖాధికారి సురేష్

మాచర్ల రూరల్: పంట సాగులో మంచి యాజమాన్య పద్ధతులను పాటిస్తూ చీడ పురుగులను తట్టుకొని నాణ్యమైన అధిక దిగుబడులను సాధించి నికర ఆదాయం పెంచుకోవచ్చునని వ్యవసాయాధికారి కట్టా లక్ష్మారెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని తాళ్ళపల్లి, కొత్తూరు గ్రామాలల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించి రైతులకు పలు సూచనలు చేశారు. ఉద్యానవన శాఖాధికారి పి.సురేష్, ఏఈఓ వర్మ, వీఏఏ లలిత, కరుణానాయక్, రైతులు పాల్గొన్నారు.

పశుగణన పోస్టర్ ఆవిష్కరణ



కారెంపూడి: మండల పశు వైద్యశాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న పశుగణనకు రైతులు, పశుపోషకులు సహకారం అందించాలని ఎంపీడీఓ జి.శ్రీనివాస రెడ్డి కోరారు. స్థానిక మండల పశు వైద్యశాలలో పశుగణన పోస్టర్‌ను బుధవారం ఎంపీడీఓ ఆవిష్కరించారు. పశు వైద్య సిబ్బంది అన్ని రకాల పశువులు, అన్ని రకాల జీవాలను గుర్తించి వాటి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారని పేర్కొన్నారు. పశు గణన వారోత్సవాలను విజయవంతం చేయాలని ఎంపీడీఓ కోరారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి పశువైద్యాధికారి దిలీప్, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎలాగయ్యా! కుటుంబాలు గడిచేదీ?

- మూడు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదు!
- కుటుంబాలు పస్తులు ఉంటున్నాయి
- అధికారులకు 104 ఉద్యోగుల వినతి


నోడల్ అధికారి డాక్టర్ హనుమకుమార్‌కు వినతి పత్రం అందజేస్తున్న 104 ఉద్యోగులు

నరసరావుపేటటౌన్: మూడు నెలలుగా వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం.. చాలీ చాలని జీతాలతో కుటుంబ పోషణ భారంగా మారింది.. సమస్య పరిష్కరించాలని 104 ఉద్యోగులు జిల్లా వైద్యాధికారి డాక్టర్ రవికుమార్, నోడల్ అధికారి డాక్టర్ హనుమకుమార్‌లను బుధవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘ ప్రతినిధులు దుంప కోటిరెడ్డి, మల్లికార్జునరావులు మాట్లాడుతూ గత మూడు నెలలుగా జీతాలు అందటం లేదని ఉద్యోగులు వాపోయారు. 104 సేవలను ప్రభుత్వమే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా నిర్వహించాలని కోరారు. 2020 తర్వాత విధుల్లో చేరిన డ్రైవర్‌లు, డీఈఓలకు జీవో నెం.7 ద్వారా వేతనాలు ఇవ్వాలని కోరారు. అక్రమంగా వసూలు చేసిన పీఎఫ్‌ను తిరిగి చెల్లించి 74 మంది సీనియర్ డ్రైవర్‌లకు స్లాబ్ అమలు చేయాలని కోరారు. ఉద్యోగులకు యాజమాన్యం నుంచి రావాల్సిన బకాయిలను ప్రభుత్వం సత్వరమే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

టీటీడీ పాలక మండలిలో గిరిజనులకు స్థానం కల్పించాలి

ఏపీ గిరిజన సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు బి.శ్రీనునాయక్



చిలకలూరిపేట: టీటీడీ పాలక మండలిలో కూటమి ప్రభుత్వం గిరిజనులకు స్థానం కల్పించకపోవడం సరికాదని ఏపీ గిరిజన సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు బి.శ్రీనునాయక్ విమర్శించారు. పట్టణంలోని సంఘ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ హాతీరామ్‌బాబాజీ భక్తులుగా ఖ్యాతి గడించిన గిరిజనులకు పాలక మండలిలో చోటు కల్పించటంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఆందోళన వ్యక్తం చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో టీటీడీ బోర్డులో గిరిజనులకు అవకాశం కల్పించారని గుర్తు చేశారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు చేసి గిరిజనులకు స్థానం కల్పించాలని లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపట్టడంతో పాటు న్యాయ స్థానాన్ని ఆశ్రయిస్తామని హెచ్చరించారు.

చెన్నకేశవ ఆలయం పరిశీలన

త్వరలో మరమ్మతులకు చర్యలు

సాక్షి ఎఫెక్ట్

కారెంపూడి: వర్షాలకు పల్నాటి చెన్నకేశవ ఆలయంపై కప్పు కారుతుండడం, భక్తుల, అర్చకుల ఇబ్బందులపై ‘చిన్న వర్షానికే చిత్తడి’ శీర్షికన ‘సాక్షి’లో గత నెల 20వ తేదీ వచ్చిన కథనానికి దేవదాయ శాఖ స్పందించింది. ఈ నేపథ్యంలో మంగళవారం దేవదాయ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాసులు ఆలయ పైకప్పును పరిశీలించారు. పల్నాటి ఉత్సవాలు సమీపిస్తున్న నేపథ్యంలో ఇప్పుడు మరమ్మతులు చేయడం సాధ్యం కాదని, ఉత్సవాల తర్వాత మరమ్మతులు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులు నిర్ణయించారు. ఈ లోగా ప్రతిపాదనలు రూపొందించడం, తర్వాత టెండర్లు పిలిచి కాంట్రాక్టర్‌కు పని అప్పగించి చేయించాల్సి ఉందన్నారు. డీఈ వెంట దేవదాయ శాఖ ఈఓలు కృష్ణంరాజు, హనుమంతరావులతో పాటు పల్నాడు ప్రాంత ఈఓలు కూడా పాల్గొన్నారు.

మట్టి ఖర్చులకు నగదు అందజేత

పిడుగురాళ్ల: పట్టణంలోని 12వ వార్డులో నివాసం ఉంటున్న మున్సిపల్ కార్మికుడు కాంద్రకుంట సీతరామయ్య అనారోగ్యంతో మృతి చెందటంతో ఆయన కుటుంబానికి బుధవారం రూ. 15 వేలు మట్టిఖర్చుల నిమిత్తం అందజేశామని మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్ తెలిపారు. మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నశీర్ అహ్మద్‌కు సాహితీ పురస్కారం

పిడుగురాళ్ల: ప్రముఖ చరిత్ర కారుడు, బహుగ్రంథ రచయిత సయ్యద్ నశీర్ అహ్మద్ రచించిన ఆజాద్ హింద్ ఫౌజ్ ముస్లిం పోరాట యోధుడు చరిత్ర గ్రంథానికి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం సాహితీ పురస్కారం ప్రకటించింది. ఈనెల 12వ తేదీన హైదరాబాద్ నాంపల్లిలోని తెలుగు విశ్వవిద్యాలయంలో జరగనున్న కార్యక్రమంలో తనకు పురస్కారం ప్రదానం చేయనున్నారని నశీర్ అహ్మద్ బుధవారం తెలిపారు. ఈమేరకు విశ్వవిద్యాలయం, సహాయ సంచాలకులు రింగు రామ్మూర్తి ద్వారా ఆహ్వానం అందించనున్నట్లు తెలిపారు.

ఏకాగ్రత, సమయ స్ఫూర్తితో ఉన్నత శిఖరాలకు..

నరసరావుపేట రూరల్: ఏకాగ్రత, సమయ స్ఫూర్తితో వ్యవహరించడం ద్వారా విద్యార్థులు ఉన్నత శిఖరాలు చేరుకోవచ్చని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం యూత్ ట్రైనర్ డాక్టర్ కాళహస్తి నల్లిబోయిన తెలిపారు. కేసానుపల్లి ఎంఏఎం గ్రూప్ కళాశాలలో బుధవారం యంగ్ మైండ్స్ డ్రీమ్ ఇట్-డూ-ఇట్ అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కాళహస్తి మాట్లాడుతూ యువత సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలని తెలిపారు. సమాజంలో వస్తున్న మార్పులను గమనిస్తూ విజయానికి బాటలు వేసుకోవాలని సూచించారు. మనిషి జీవితంలో ఉన్నతస్థాయికి ఎదగాలంటే తనకంటూ ప్రత్యేకతను ఏర్పరుచుకోవాలని తెలిపారు.

వీరుల గుడి ఆవరణలో విద్యుత్ లైన్ల ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్


వీరుల గుడి ఆవరణలో విద్యుత్ లైను లాగుతున్న దృశ్యం

కారెంపూడి: పల్నాటి వీరుల గుడిలో అధ్వాన పరిస్థితులపై ‘సమస్యల రణక్షేత్రం’ శీర్షికన గత నెల 27న ‘సాక్షి’లో ప్రచురితమైన కథనానికి ఒక్కో శాఖ అధికారులు స్పందిస్తున్నారు. ఇటీవల ఆలయ ప్రాంగణంలో జంగిల్ క్లియరెన్స్ జరిపి, మరమ్మతులకు శ్రీకారం చుట్టిన అధికారులు బుధవారం వీరుల గుడి ఆవరణలో నూతనంగా విద్యుత్ లైన్లను ఏర్పాటు చేశారు. ప్రహరీ వెంట చుట్టూ విద్యుత్ స్తంభాలు వేసి లైన్ లాగారు. అలాగే ఉత్సవ ప్రధాన ప్రాంగణంలో కూడా ప్రధాన గేటు నుంచి ముఖద్వారం వరకు విద్యుత్ లైన్ ఏర్పాటు చేశారు. వీరుల గుడి ఆలయ ప్రాంగణానికి ఆ పరిసర ప్రాంతానికి కలిపి ప్రత్యేకంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. ఈ విధంగా లైన్ లాగడం వల్ల వీరుల గుడి ఆవరణలో విద్యుత్ స్తంభాలకు లైట్లు ఏర్పాటు చేసుకునే అవకాశం కల్పించారు. దీంతో పాటు ముఖ్యంగా ఉత్సవాల సమయంలో విద్యుత్ సౌకర్యానికి ఎలాంటి అంతరాయం లేకుండా వ్యాపార సంస్థలు, ఇతర ప్రదర్శన శాలలకు కూడా విద్యుత్ అవసరాలు తీర్చే విధంగా గుడి ప్రాంగణం మొత్తం లైటింగ్‌కు సౌకర్యం కలిగింది. విశేషమేమిటంటే ఎల్‌డబ్ల్యూఈ స్కీంలో భాగంగా మెరుగైన విద్యుత్ అందించడం కోసం జరుగుతున్న విద్యుత్ ఆధునీకరణ పనుల్లో భాగంగా ఈ పనులు చేశారు. వీరారాధన ఉత్సవాల నేపథ్యంలో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి సూచనల మేరకు కాంట్రాక్టర్లు ఈ పనులు చేశారు. అలాగే నాగులేరు బ్రిడ్జిపై సెంటర్‌లో ఎల్ఈడీ లైట్లు ఏర్పాటు చేస్తామని పంచాయతీ సర్పంచ్ సరస్వతీభాయి తెలిపారు. ఎల్ఈడీ లైట్లు తెప్పించామన్నారు. సాక్షి కథనంతోనే గతంలో ఎన్నడూలేని విధంగా అన్ని శాఖల అధికారులు ఆలయ సమస్యల పరిష్కారంపై దృష్టి సారించారని ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

నైపుణ్య గణన సర్వేపై శిక్షణ


సచివాలయ సిబ్బందికి శిక్షణనిస్తున్న నిర్వాహకులు

పిడుగురాళ్ల: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న నైపుణ్య గణన సర్వే కార్యక్రమం ప్రారంభం కానున్న సందర్భంగా పట్టణంలోని మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్ ఆధ్వర్యంలో బుధవారం సచివాలయ సిబ్బందికి గాంధీనగర్ సచివాలయం వద్ద శిక్షణ తరగతులు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ ఉదయం రాజు హాజరయ్యారు. నైపుణ్య శిక్షణ అధికారి అంజిరెడ్డి సచివాలయ సిబ్బందికి గణన సర్వేపై శిక్షణ ఇచ్చారు. నైపుణ్యాభివృద్ధి కో-ఆర్డినేటర్ శ్రీకాంత్ మొబైల్ అప్లికేషన్స్‌పై అవగాహన కల్పించారు. సచివాలయ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది, స్కిల్ సిబ్బంది పాల్గొన్నారు.

వచ్చేనెలలో జిల్లాస్థాయి సాంస్కృతిక పోటీలు

నియోజకరవర్గ బాల ఉత్సవ కన్వీనర్ బెజవాడ నాగేశ్వరరావు


వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

శావల్యాపురం: పల్నాడు జిల్లాస్థాయిలో డిసెంబరు 13,14 తేదీల్లో జరగనున్న జిల్లాస్థాయి అంతర్ పాఠశాలల సాంస్కృతిక పోటీలను విజయవంతం చేయాలని నియోజకరవర్గ బాల ఉత్సవ కన్వీనర్ బెజవాడ నాగేశ్వరరావు అన్నారు. బుధవారం మండలంలోని మతుకుమల్లి, కారుమంచి, శావల్యాపురం గ్రామాల్లోని జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకత, నైతిక విలువలు, పోటీతత్వం నాయకత్వ లక్షణాలు తదితరవన్నీ పెంపొందించడానికి ఎంతో దోహద పడతాయన్నారు. గత ఏడాది జిల్లా నలుమూలల నుంచి రెండు రోజుల పాటు నిర్వహించిన బాల ఉత్సవాలకు 15 వేల విద్యార్థులకు 64 ఈవెంట్స్‌లో పాల్గొన్నట్లు నిర్వాహకులు కట్టా కోటేశ్వరరావు, ఆక్స్‌ఫర్డ్ స్కూలు డైరెక్టరు రాజారెడ్డి తెలిపారు. ఈ ఏడాదిలో జరగనున్న బాల ఉత్సవాలకు 20 వేల మంది బాల బాలికలు పాల్గొంటారన్నారు. ఎంట్రీ ఫీజు లేదని, పోటీల్లో పాల్గొనే వారందరికీ రెండు రోజుల ఉచిత భోజనం కూడా ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ ప్రతినిధి వెంకట్, కుమ్మరి శ్రీనివాసరాజు, అబ్దుల్లా, గరికపాటి రవి, టి.నిర్మల కుమారి, హబీ పాల్గొన్నారు.

అక్రమ మద్యం విక్రేత అరెస్ట్

వినుకొండ (నూజెండ్ల): అనధికారికంగా మద్యం వి క్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసిన సంఘటన బుధ వా రం జరిగింది. వినుకొండ ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని వినుకొండ మండలంలో గల పెరుమాళ్లపల్లి గ్రామానికి చెందిన కొత్తమాసు రాము అనే వ్యక్తి అనధికారికంగా మద్యం విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకొని అతని వద్ద ఉన్న 12 మద్యం బాటిళ్ల (180 పరిమాణం)ను స్వాధీనం చేసుకొని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ శ్రీనివాసరావు తెలిపారు.

పల్లెపండుగ పనులు పారదర్శకంగా నిర్వహించాలి

శావల్యాపురం: మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి పథకంలో భాగంగా పల్లెపండుగ కార్యక్రమంలో చేపట్టిన అభివృద్ధి పనులు పారదర్శకంగా చేయా లని జిల్లా డ్వామా పీడీ మఠం సిద్ధాలింగమూర్తి అన్నారు. బుధవారం మండలంలోని ఇర్లపాడు గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులను ఉపాధి అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధి పీడీ సిద్ధాలింగమూర్తి మాట్లాడుతూ జిల్లాలో గోకులం షెడ్లు 706, సీసీ రోడ్లు, డ్రైయిన్స్ పనులు 618 మంజూరు కాగా ఉపాధి నిధులు రూ. 70 కోట్ల 84 లక్షల నిధులను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో సీసీ రోడ్లు పనులు 134 గోకులం షెడ్లు 96 పూర్తయినట్లు తెలిపారు. పల్లె పండుగ కార్యక్రమంలో మంజూరైన పనులన్నీ ఈ నెలఖారులోగా ప్రారంభించాలన్నారు. అలాగే పనులన్నీ సంక్రాంతి లోగా నూరుశాతం పూర్తి చేయాలన్నారు. పనులన్నీ నాణ్యాత ప్రమాణాలు పాటించేలా క్షేత్రస్థాయిలో అధికారు లు నిరంతరం పర్యవేక్షణ చేయాలన్నారు. ఉపాధి అధికారులు సిబ్బంది జాబ్ కార్డులు ఉన్నవారందరికీ పనులు కల్పించాలన్నారు. అనంతరం గ్రామంలో అంగన్‌వాడీ సెంటరు సందర్శించి సెంటరు నిర్వాహణ పనితీరు తదితరవన్నీ పరిశీలించారు. ఆయనతో పాటు ఏపీడీ బూసిరెడ్డి, ఏపీవో కె.రామారావు, పంచాయతీరాజ్ ఏఈ వెంకటేశ్వర స్వామి ఉన్నారు.